హై సెక్యూరిటీ ప్రాంతాలుగా ప్రకటించాలి



వైద్య విద్యార్థినిపై విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలో అమానుషంగా అత్యాచారం చేసి హత్య చేయటం దుర్మార్గమైన చర్య. ఇటువంటి చర్యలకు దేశంలో మరెవ్వరు పాల్పడకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి. శాశ్వతంగా హైసెక్యూరిటీ ప్రాంతాలుగా ఆస్పత్రులను ప్రకటించి వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని ఐఎంఏ డిమాండ్ చేస్తుంది.

– డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కుమార్, ఐఎంఏ, పిడుగురాళ్ల శాఖ అధ్యక్షులు



కఠినంగా శిక్షించాలి

విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలో మహిళా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా దేశం గర్వపడేలా శిక్షించాలి. మన దేశంలో మహిళలను గౌరవిస్తాం. మహిళా వైద్యులను మరింత గౌరవిస్తాం. అలాంటిది మహిళా వైద్యురాలిపై హత్యాచారం చేయటం క్షమించరాని నేరం. అటువంటి నీచులను క్షమించకూడదు. ఆ దుర్మార్గులను కఠినంగా శిక్షించి భవిష్యత్‌లో ఎవరు ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా చెయ్యాలి.

– డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు, పిడుగురాళ్ల



పడకేసిన పారిశుద్ధ్యం.. మంచం పడుతున్న ప్రజలు

- విషజ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- డెంగీ, చికెన్‌గున్యా లక్షణాలతో రోగులు
- విపరీతమైన కాళ్ల వాపులు, కీళ్ల నొప్పులు
- రోగులతో కిక్కిరిసిపోతున్న ఆస్పత్రులు
- నామమాత్రపు వైద్యసేవలతో ఇక్కట్లు

దాచేపల్లి : విష జ్వరాలతో పల్లెలు మంచం పడుతున్నాయి. చిన్నా, పెద్దా అందరూ ఈ జ్వరాల బారిన పడుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా జ్వరాలు పీడిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దాచేపల్లి నగర పంచాయతీతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు దాదాపు నెల రోజుల నుంచి అత్యధికంగా నమోదవుతున్నాయి. ఒక్కో ఇంటిలో ఇద్దరు, ముగ్గురు చొప్పున జ్వరపీడుతులు ఉంటున్నారు. తొలుత ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే ఆ తరువాత ఇంటిలో వారందరూ జ్వరాల బారిన పడుతున్నారు. ఎక్కువగా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు వ్యాపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. జ్వరాలు రోజు రోజుకి పెరిగిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జ్వరాలు ప్రబలుతున్నప్పటికీ ప్రభుత్వం వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవటంతో ప్రభుత్వం తీరుని పలువురు తప్పు పడుతున్నారు. అలాగే పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దాచేపల్లి పీహెచ్‌సీలో వైద్య సేవల కోసం వచ్చిన జ్వర బాధితులు




దాచేపల్లి పీహెచ్‌సీలో జ్వర బాధితులకు ఎక్కిస్తున్న సెలైన్

కాళ్ల వాపు, కీళ్ల నొప్పులతో ఇక్కట్లు

సాధారణంగా జ్వరం వస్తే ఒకటి రెండు రోజుల్లో తగ్గుముఖం పడుతుంది. కానీ ఇప్పుడు వస్తున్న జ్వరాలు నెల రోజులకుపైగానే శరీరంపై ఉంటున్నాయి. సాధారణ జ్వరం వచ్చి డెంగీ, చికెన్‌గున్యాగా మారిపోతున్నాయి. దీంతో జ్వరాల బారిన పడిన వారు విపరీతమైన కాళ్ల వాపులు, కీళ్ల నొప్పులతో తల్లడిల్లిపోతున్నారు. చేతికర్ర సాయంతో అడుగులు వేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. హాస్పిటల్‌కి వైద్యం కోసం వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితుల్లో జ్వర పీడితులు ఉంటున్నారు. కాళ్ల నొప్పులతో బాధపడుతున్న వృద్ధులు హాస్పిటల్స్‌కి వెళ్లలేక ఇంట్లోనే మగ్గిపోతున్నారు. నగర పంచాయతీతో పాటుగా గ్రామాల్లో జ్వరాల కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నప్పటికి సరియైన వైద్య సేవలు ప్రజలు అందకపోవటంతో ప్రాణాల మీదకు వస్తున్నాయి.

నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు

నగర పంచాయతీతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. పారిశుద్ధ్య పనులు నామమాత్రంగా జరుగుతుండటంతో దోమల తీవ్రత అధికంగా ఉంది. దోమ కాటు వలన కూడా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవటం, వీధుల్లో మురికి నీరు నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం కావటం వలన జ్వరాల వస్తున్నాయి. తాగునీరు సరఫరా చేసే ట్యాంకులను కూడా శుభ్రం చేయకుండా వదిలేస్తున్నారు. మంచినీరు అందించే బోర్ల చుట్టూ మురికి, బురద పేరుకుపోయి ఉన్నాయి. దీంతో తాగునీరు కూడా కలుషితం అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

హాస్పిటల్స్‌కి పెరిగిన రోగుల తాకిడి

జ్వర బాధితులతో హాస్పిటల్స్‌కి తాకిడి పెరిగింది. దాచేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకి 200 ఓపీ వస్తే అందులో సగానికి పైగా జ్వరాల కేసులే నమోదు అవుతున్నాయి. దాచేపల్లి పీహెచ్‌సీ 6 పడకల ఆస్పత్రి కావటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నడికుడి, దాచేపల్లిలోని మరో పీహెచ్‌సీలకు డాక్టర్లు లేకపోవటంతో అందుబాటులో ఉన్న ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. జ్వరాల బారిన పడిన రోగులకు రక్త పరీక్షలు నరకం చూపిస్తున్నాయి. దాచేపల్లి పీహెచ్‌సీలో కొన్ని రకాల రక్త పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండటంతో మిగతా పరీక్షలకు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి. రక్త పరీక్షలకు ప్రైవేట్ ల్యాబ్‌ల నిర్వాహకులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వెళితే పలు రకాల రక్త పరీక్షలకు సుమారు రూ.2 వేలకు పైగా వసూలు చేస్తున్న పరిస్థితి ఉందని బాధితులు చెబుతున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగాల బారిన పడిన వారికి సత్వర వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



తాగునీరు అందించే బోరు చుట్టూ పేరుకుపోయిన నాచు, బురద

జ్వరం కేసులు ఎక్కువగానే వస్తున్నాయి



వాతావరణంలో మార్పులు, వర్షాలు కురుస్తుండటం వలన జ్వరాల కేసులు ఎక్కువగానే నమోదు అవుతున్నాయి. మండల పరిధిలోని పీహెచ్‌సీకి ఎక్కువగానే జ్వర బాధితులు వస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విష జ్వరాలతో బాధపడే వారికి సత్వరమే వైద్య సేవలు అందిస్తున్నాం. మెరుగైన వైద్యం కోసం కొంత మందిని గురజాల, నరసరావుపేట ఏరియా ఆస్పత్రులకు పంపిస్తున్నాం. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. జ్వరాలతో బాధపడే వారు పీహెచ్‌సీలకు వస్తే వైద్య సేవలు అందిస్తాం.

– డాక్టర్ ఆదిబోయిన కాశీ మధుసూధన్‌రావు, పీహెచ్‌సీ, దాచేపల్లి

క్లుప్తంగా

ముగిసిన యల్లమ్మతల్లి కొలుపులు



వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న యల్లమ్మతల్లి కొలుపులు ఘనంగా ముగిశాయి. గ్రామస్తులు గత ఐదు రోజులుగా యల్లమ్మ తల్లి కొలుపులను వివిధ రకాలుగా నిర్వహిస్తూ శనివారం చివరి రోజు ఘనంగా నిర్వహించి ముగించారు. భక్తులు అమ్మవారికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి ఉత్సవాలలో భాగంగా గ్రామంలో ఊరేగింపు, చివరి రోజు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సంప్రదాయాలు పాటిస్తూ ఇలాంటి ఉత్సవాలను గ్రామస్తులు కలిసికట్టుగా నిర్వహించుకోవటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై యువకుడికి తీవ్రగాయాలు



వెల్దుర్తి: మాచర్ల పట్టణం శ్రీశైలం రోడ్డులోని రింగ్‌రోడ్డు వద్ద కేసీవీఆర్ కాంట్రాక్ట్ సంస్థలో పనిచేస్తున్న ప్రకాష్‌దేవ్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాలపాలైన ఘటన శనివారం జరిగింది. కేసీవీఆర్ హైవే రోడ్డు కాంట్రాక్ట్ కంపెనీలో పెయింటర్‌గా పనిచేస్తున్న కోల్‌కతాకు చెందిన ప్రకాష్‌దేవ్ 30 అడుగుల ఎత్తులో గల విద్యుత్ స్తంభాలకు సిల్వర్ పెయింట్ వేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కింద పడటంతో తలకు తీవ్రగాయాలు కావటంతో పరిస్థితి విషమంగా మారింది. శరీరం కాలి బొబ్బలు వచ్చాయి. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్లు ప్రకాష్‌దేవ్‌ను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నరసరావుపేట జీబీఆర్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రకాష్‌దేవ్‌కు ప్రాణహాని లేదని వైద్యులు తెలిపినట్లు సంస్థ ప్రతినిధులు చెప్పారు. విద్యుత్ సరఫరా నిలిపి వేయకుండా పనులు చేయించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

ఈ పోస్ యంత్రాలతో ఎరువులను పంపిణీ చేయాలి

ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి



రెంటచింతల: ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే ఎరువుల డీలర్లు ఈ పోస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువుల పంపిణీ చేయాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతు రైతులు పట్టాదారు పాస్‌పుస్తకానికి ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్ష పత్రాల విశ్లేషణ ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులను వాడుకోవాలన్నారు. రైతులు అనవసరంగా రసాయనిక ఎరువులను ఎక్కువ మోతాదులో వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం వలన పెట్టుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులను, పురుగు మందులను వాడినట్లయితే తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు డీలర్లు సబ్సిడీపై ఎరువులను విక్రయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లయితే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదకరంగా టిప్పర్



పిడుగురాళ్ల: ఈ టిప్పర్ వెనుక ప్రయాణిస్తే ఎప్పుడు లోడు చేసిన రాళ్లు పడతాయో, ఏ వాహనదారుడికి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అంత ప్రమాదకరంగా టిప్పర్‌లో సున్నపురాయిని తరలిస్తున్నారు. శనివారం పిడుగురాళ్ల పట్టణం నుంచి మండలంలోని కామేపల్లి శివారులో ఉన్న ముగ్గురాయి ఫ్యాక్టరీకి టిప్పర్ ద్వారా ఈ రాయిని తరలిస్తున్నారు. టిప్పర్‌కు బాడీ వరకే లోడు చేయాల్సి ఉండగా బాడీ పై భాగం వరకు లోడ్ చేయటం వలన వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో సడన్ బ్రేక్ వేస్తే రాళ్లు కింద పడే ప్రమాదం ఉంది. ఆ సమయంలో టిప్పర్ వెనుక ప్రయాణించే వాహనదారులకు మరింత ప్రమాదం కలిగే అవకాశం ఉంది. ఇలా ప్రమదాకరంగా వెళ్తున్న టిప్పర్లు, క్వారీ, సున్నపు పరిశ్రమలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కమిషనర్ మోహన్ శ్రీనివాస్



గురజాల : పరిసరాల పరిశుభ్రత పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాస్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో శనివారం రాత్రి దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరిబొండాలు, పాడైపోయిన ప్లాస్టిక్ వస్తువులు వంటివి నిల్వ ఉంచరాదన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు ఉధృతంగా వస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



గురజాల : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కోట శ్రీనివాసరావు, షేక్ జానీబాషా, వై.నరసింహారెడ్డి, కోటేశ్వరరావు, హెచ్‌ఎం ఏవీ రమణ తదితరులున్నారు.

విద్యకే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత



విద్యార్థులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి



విద్యార్థులకు ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ శర్మ

రెంటచింతల: బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి, జిల్లా భూగర్భ జలాల అధికారి సత్యనారాయణ శర్మ అన్నారు. శనివారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర), సంక్షేమ వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలో మౌలిక వసతులు, విద్యార్థులకు వండిన ఆహారాన్ని ఆయన పరిశీలించి ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఒకే గదిలో పడుకోవడం, చదువుకోవడం జరుగుతుందని, ఆట స్థలం లేకపోవడంతో ఆటలపై దృష్టి పెట్టలేక పోతున్నామని, మెస్‌హాల్ లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఆయనకు తెలిపారు. సమస్యలను కలెక్టర్ పి.అరుణ్ బాబు దృష్టికి తీసుకువెళ్తానని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ప్రణాళికా బద్ధంగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. పట్టుదల, కృషి, పోటీతత్వం కలిగి ఉండాలని మహనీయుల జీవిత చరిత్రలను చదవడం వలన ప్రేరణ కలుగుతుందన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ వై.మోహన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయండి అంటూ కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాసరావు తహసీల్దార్ జి.కరుణకుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల కేంద్రం రెంటచింతలలో జెడ్పీ హైస్కూల్ ఏర్పాటు చేయాలని, స్థానిక బస్టాండ్‌లో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని, రెండు చర్చిల మధ్య బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రెంటచింతలలో శాశ్వత గ్రంథాలయం, నజీరుద్దీన్ చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కు, రెంటచింతలకు కృష్ణా జలాలు, రైలుపేటలో హిందూ శ్మశాన వాటిక, పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు, బావులలో నీటిని శుభ్రం చేయడం, గిరిజన పాఠశాలలో అదనపు గదులు, ప్లాస్టిక్ నిషేధం, మాచర్ల–విజయవాడ మెమూ రైలుకు అదనపు బోగీలను ఏర్పాటు చేయాలని, పల్నాడు గాంధీ నాళం మట్టపల్లి స్మృతివనం, ఎస్సీ, ఎస్టీ, బీసీ బాల బాలికల వసతి గృహాల్లో మరమ్మతులు, అలాగే ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తహసీల్దార్ హామీనిచ్చారన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులున్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న కన్నెగంటి ఫౌండేషన్ సభ్యులు

ఏఐటీయూసీ సమావేశాలు జయప్రదం చేయండి

సత్తెనపల్లి: కేంద్రంలోని ఎన్డీఏ మోదీ ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న విధానాలపై చర్చించేందుకు విశాఖపట్నంలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంభాల శ్రీనివాస్ కోరారు. శనివారం సత్తెనపల్లిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సత్తెనపల్లి నియోజకవర్గ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదైన రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, బొగ్గు గనులను కారు చౌకగా అప్పజెబుతోందని విమర్శించారు. ప్రభుత్వ కార్మికులకు భద్రత కల్పించకుండా వారి శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మేళనాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పి.ఇర్మియ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, ఈసీ రెడ్డి, ఎ.రమేష్, ఇరుపాల్ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

విజయపురిసౌత్: స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల హెచ్‌ఎం సుజిత ముఖ్యఅతిథిగా హాజరై సభాధ్యక్షత వహించారు. హెచ్‌ఎం సుజిత మాట్లాడుతూ విద్యార్థులకు సర్వ మత సమ్మేళనంపై అవగాహన ఉండేలా క్రిస్టియన్, హిందూ, ముస్లిం మతాలకు చెందిన పండుగలను పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా హిందువులకు ఎంతో పవిత్రమైన కృష్ణాష్టమి పండుగను కనుల పండువగా నిర్వహించామన్నారు. పాఠశాల విద్యార్థులచే ఉట్టి కొట్టించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి కంటి పరీక్షలు

సత్తెనపల్లి: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డాక్టర్ అగర్వాల్ ఐ క్లినిక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు కంటి పరీక్షలు చేయించుకున్నారు. స్టేషన్‌లోని సిబ్బందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు.

నిత్యావసర వస్తువులు అందజేత

గురజాల : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని మాదుగుల గ్రామానికి చెందిన ఎం.వెంకటేష్, చందనలు ఆశ్రమానికి నెల రోజులకు సరిపడా సరుకులు అందించారు.



దమ్ము చేస్తున్న ట్రాక్టర్



ఆకురాజుపల్లి కాలువ నుంచి వస్తున్న నీరు

కాలువ వచ్చే.. నాట్లు మొదలయ్యే

నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి సాగుకు నీరు వస్తుండటంతో రైతులు వరి నాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఏపుగా వరి నారుమళ్లు పెరగటంతో కాలువ కింద సాగు అయ్యే మాగాణి పొలాల్లో నాట్లు వేసే కార్యక్రమం మొదల పెట్టారు. పిడుగురాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరినార్లను పెంచారు. మాగాణి పొలాలను ట్రాక్టర్లతో దమ్ము చేయించి, మానుతో చదును చేసి వరి నాట్లను వేస్తున్నారు. ఇప్పటికే పిడుగురాళ్ల పట్టణ శివారులో వారి నాట్లు వేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు, సాగర్ కుడికాలువ ద్వారా వచ్చిన సాగు నీటితో వరి నాట్లను వేసే కార్యక్రమంలో రైతులు నిమగ్నమయ్యారు.

– పిడుగురాళ్ల



రైతులు పెంచిన వరి నారిమళ్లు

ఊటుకూరులో వైద్య శిబిరం

ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యులు డాక్టర్ సిరిచందన తెలిపారు. గ్రామంలో జ్వరాలు అధికంగా ఉన్నాయన్న సమాచారం మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేసామని చెప్పారు. ముగ్గురు జ్వర పీడితులకు వైద్య చికిత్సలు అందించామన్నారు. గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా మురుగు కాలువల్లో ఎబెట్ స్ప్రే చేయించటం, లార్వా అభివృద్ధి చెందకుండా పీడీపీ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి బేగ్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అవగాహనతోనే డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి



అమరావతి: స్థానిక పల్లోటి జూనియర్ కాలేజీలో ఫాదర్ వినోద్ ఆధ్వర్యంలో శనివారం డ్రగ్స్ మాఫియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్ పట్టణ ప్రాంతంలో గాక పల్లెటూళ్లలో కూడా ప్రవేశించాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తులై బాధ్యతగా చదువుకోవాలన్నారు. ప్రపంచాన్ని గడగలాడిస్తున్న డ్రగ్స్‌ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తరిమికొట్టాలని, నేటి యువత డ్రగ్స్ బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆడపిల్లలు కూడా డ్రగ్స్ తీసుకుంటున్నారని.. ఇది చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పల్లోటి కళాశాల డైరెక్టర్ ఫాదర్ భాస్కర్, ఎస్సై నరసింహ, గుడ్‌షెపర్డ్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.